క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా మంగళవారం సరూర్‌నగర్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డివిజినల్ ఇంజనీర్ రామకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ పెద్దఅంబర్‌పేట, లక్ష్మీగణపతి ఫీడర్ల పరిధిలోని కాలనీల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు. 11కేవీ కొహెడ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 వరకు విద్యుత్ సరఫరా ఉండదని డీఈ తెలిపారు. వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

పేదలకు అండగా కేఎంఆర్ ట్రస్ట్

ట్రస్టు చైర్మన్ మనోహర్‌రెడ్డి



పుష్పలతకు నివాస స్థలం పట్టా అందజేస్తున్న మనోహర్ రెడ్డి

పహాడీషరీఫ్: కేఎంఆర్ ట్రస్ట్ పేదలకు అండగా నిలుస్తుందని ఆ ట్రస్ట్ చైర్మన్ కొత్త మనోహర్ రెడ్డి అన్నారు. జల్‌పల్లి మున్సిపాలిటీ శ్రీరాంకాలనీకి చెందిన పుష్పలతకు 60 గజాల నివాస స్థలానికి సంబంధించిన పట్టాను సోమవారం మనోహర్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జల్‌పల్లిలో నివాసం ఉంటున్న ఎంతోమంది పేదలకు తమ ట్రస్ట్ ద్వారా సేవలందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీకి చెందిన రేఖ, సుగుణమ్మ, జ్యోతి, సత్యదేవ, పావని, హమీద, అనిత, రియాన బేగం, కృష్ణవేణి, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల అదుపు

డీసీపీ శ్రీనివాస్




సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న డీసీపీ

ఇబ్రహీంపట్నం రూరల్: నేరాల అదుపునకు సీసీ కెమెరాలు దోహదపడతాయని మహేశ్వరం డీసీపీ చింతమనేని శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదిబట్ల మున్సిపాలిటీ మంగళ్‌పల్లిగేటు సమీపంలో హాస్టల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల(11)ను డీసీపీ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమని తెలిపారు. హాస్టల్ అసోసియేషన్ యజమానులు ఇంత చక్కటి కార్యక్రమం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఇబ్రహీంపట్నం ఏసీపీ శ్రీనివాస్‌రావు, సీఐ గోవింద్‌రెడ్డి, ఎస్‌ఐలు మారయ్య, మైబెల్లితో పాటు కౌన్సిలర్ కృష్ణంరాజు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

టీచర్స్‌కాలనీ నూతన కమిటీ ఎన్నిక

హస్తినాపురం: హస్తినాపురం డివిజన్ పరిధిలోని టీచర్స్ కాలనీ ఫేజ్–1 సౌత్‌పార్ట్ కాలనీ సంక్షేమ సంఘంతో పాటు కాలనీలోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయ నూతన కార్యవర్గాన్ని కాలనీ వాసులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాలనీ అధ్యక్షుడిగా వల్లపురెడ్డి, గౌరవ అధ్యక్షుడిగా డి.విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా డి.గణేశ్, కోశాధికారిగా జి.బాలక్రిష్ణ ప్రజాపతిని ఎన్నుకున్నారు. ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం కమిటీ చైర్మన్‌గా బి.కొండల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గా ఎం.బుచ్చిరెడ్డి, కోశాధికారిగా మణిపాల్‌రెడ్డి ఎన్నికయ్యారు. కాలనీ సంక్షేమం కోసం అందరం కృషిచేయాలన్నారు.

'నియామకాల్లో అవకతవకలు జరిగాయి'



అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న ఆర్టిజన్స్

తుర్కయంజాల్: ఉద్యోగ నియామకాల్లో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ డివిజన్ కార్యాలయం ఎదుట సిబ్బంది ఆందోళనకు దిగారు. వివరాలు.. ఇబ్రహీంపట్నం డివిజన్ పరిధిలో ఇటీవల జరిగిన జూనియర్ లైన్‌మెన్ నియామకాల్లో డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ ఆపరేషన్ ఇబ్రహీంపట్నం అవకతవకలకు పాల్పడ్డారని ఆరోపిస్తూ ఆర్టిజన్స్, జూనియర్ లైన్‌మెన్లు సోమవారం తుర్కయంజాల్‌లోని డివిజన్ కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. ఈ నియామకాల్లో టీఎస్‌ఎస్‌పీడీసీఎల్ సీఎండీ ఆదేశాలను బేఖాతరు చేసి నియామకాలు చేపట్టారని ఆరోపించారు.



మహేశ్వరం: శివగంగ ఆలయంలో యాగం నిర్వహిస్తున్న పండితులు



మీర్‌పేట: పూజలో కార్పొరేటర్ ధనలక్ష్మి, మహిళలు



తుక్కుగూడ: బాలాత్రిపుర సుందరి దేవి అలంకరణలో అమ్మవారు

శరన్నవరాత్రి శోభ

మహేశ్వరం నియోజకవర్గంలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాల ఆవరణల్లో మహిళలు బతుకమ్మ ఆడారు. దుర్గాదేవి ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చింది. ఆలయాల వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

– సాక్షి, డెస్క్



కందుకూరు: దుర్గామాత మండపంలో భక్తులు



మహేశ్వరం: బాలత్రిపుర సుందరి దేవి అలంకరణలో అమ్మవారు



దిల్‌సుఖ్‌నగర్: పూజలో కోదాడ ఎమ్మెల్యే మల్లయ్య యాదవ్



దిల్‌సుఖ్‌నగర్: గాయత్రీదేవి అలంకరణలో..

కాంగ్రెస్‌తోనే మైనార్టీల సంక్షేమం



మేయర్ పారిజాత సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన నాయకులు

బడంగ్‌పేట్ మేయర్ పారిజాత

పహాడీషరీఫ్: మైనార్టీల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ మేయర్ పారిజాత స్పష్టం చేశారు. జల్‌పల్లికి చెందిన వివిధ పార్టీల నాయకులు యాకుబ్, బాబు, రియాజ్ తదితరులు పెద్ద సంఖ్యలో ఆదివారం రాత్రి మేయర్ పారిజాత సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పారిజాత మాట్లాడుతూ.. జల్‌పల్లి మున్సిపాలిటీలో శంకుస్థాపనలు చేస్తున్నారు తప్ప పనులు జరగడం లేదన్నారు. మైనార్టీల సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో మహేశ్వరంలో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు రాఘవేందర్ రెడ్డి, రియాజ్ ఖాన్, మౌనికా రెడ్డి, అఫ్జల్ అహ్మద్, షరీఫ్, ఇమ్రాన్, యూసుఫ్‌ఖాద్రీ తదితరులు పాల్గొన్నారు.

నేడు నూతన పార్టీ ప్రకటన



పురుషోత్తం

బడంగ్‌పేట: బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలోని కుర్మల్‌గూడకు చెందిన బొద్రమోని పురుషోత్తం నూతన పార్టీని స్థాపించబోతున్నారు. అందుకు సంబంధించిన మొదటి సమావేశాన్ని మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. నూతన పార్టీ పేరు 'సోషలిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎస్‌పీఐ)' అని తెలిపారు. ఉదయం 11 గంటలకు తెలంగాణ అమరవీరుల స్థూపానికి, 12:30 గంటలకు అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తామని తెలిపారు. అనంతరం 2 గంటలకు బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో పార్టీ ఆవిర్భావ సమావేశం ఉంటుందని పురుషోత్తం తెలిపారు. రాష్ట్రంలోని అన్నిజిల్లాల నుంచి రైతులు, లెఫ్ట్ ఉద్యమకారులు, మహిళలు, పెద్దఎత్తున విచ్చేసి సభను విజయవంతం చేయాలని కోరారు.

'కసిరెడ్డిని గెలిపించుకుందాం'



ప్రచారంలో ఎన్‌ఎస్‌యూఐ నాయకులు

కడ్తాల్: కల్వకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేస్తున్న ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డికి మద్దతుగా సోమవారం ఎన్‌ఎస్‌యూఐ నాయకులు ప్రచారం నిర్వహించారు. మండల పరిధిలోని ముద్వీన్, కోర్లకొండ తండాల్లో ఎన్‌ఎస్‌యూఐ నాయకులు గడపగడపకు వెళ్లి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే చేపట్టబోయే 6 గ్యారంటీ స్కీంల గురించి వివరించారు. ప్రజలు కసిరెడ్డిని, హస్తం పార్టీని ఆశీర్వాదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు షాబుద్దీన్, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు మధు, నాయకులు దర్శన్, ప్రవీన్, క్రాంతి, నవీన్, జశ్వంత్, శివ, విజయ్, చరణ్ పాల్గొన్నారు.

స్పోర్ట్స్ షాప్‌లో భారీ అగ్ని ప్రమాదం

హస్తినాపురం: ప్రమాద వశాత్తు విద్యుత్ షాక్‌తో మంటలంటుకుని వీఐపి స్పోర్ట్స్ షాపులో బారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఈ సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సంఘటనకు సంబంధించి వనస్థలిపురం సీఐ జలేంధర్‌రెడ్డి తెలిపిన మేరకు.. పోలీస్‌స్టేషన్ పరిధిలోని రెడ్‌వాటర్ ట్యాంకు దగ్గర ఏర్పాటు చేసిన వీఐపీ స్పోర్ట్స్ షాపులో సోమవారం ఉదయం ఆరున్నర గంటల ప్రాంతంలో అకస్మాత్తుగా భారీగా ఎగిసిపడుతున్న మంటలను చూసి స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది రెండు ఫైర్ ఇంజన్‌లతో మంటలను ఆర్పేందుకు డీఆర్‌ఎఫ్ సిబ్బందితో మంటలను అదుపులోకి తెచ్చారు. ప్రమాదంలో రూ.15 లక్షల వరకు ఆస్తినష్టం జరిగి ఉండవచ్చునని షాప్ నిర్వాహకుడు సంతోష్ వెల్లడించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఓటర్ల చైతన్యం కోసం 'రైట్ ఓట్ చాలెంజ్'

వనస్థలిపురం: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా పోటాపోటీగా ఓట్లు కొనే నాయకులను, ఓట్లు అమ్ముకునే ఓటర్లను, అసలు ఓటే వేయని ఓటర్లను చైతన్యం చేయడానికి 'రైట్ ఓట్ ఛాలెంజ్' అనే ఉద్యమ కార్యక్రమానికి వనస్థలిపురంలోని జాగృతి అభ్యుదయ సంఘం శ్రీకారం చుట్టింది. రైట్ ఓట్ ఛాలెంజ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం వనస్థలిపురంలో నిర్వహించిన సమావేశానికి జీరో బడ్జెట్ పాలిటిక్స్ కన్వీనర్ పోతిరెడ్డి మాధవరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు కోట్లు కుమ్మరించిన వారిని కూడా కాదని నిజాయితీ, నిబద్ధతతో ప్రజా సేవ చేసే నాయకులను ప్రజలు కొన్ని ప్రాంతాలలో గెలిపిస్తున్నారని అన్నారు. అటువంటి వారిని ఆదర్శంగా తీసుకుని రాజకీయ పార్టీల అభ్యర్థులు ఈసీ నిబంధనలకు అనుగుణంగా, ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికల్లో గెలవాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌వీఆర్‌కే.మూర్తి పాల్గొన్నారు.

మేనిఫెస్టోపై బీఆర్‌ఎస్ నేతల సంబరాలు



ఆర్‌కేపురంలో బాణసంచా కాలుస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు

దిల్‌సుఖ్‌నగర్: బీఆర్‌ఎస్ మేనిఫెస్టో తో ప్రతిపక్షాల్లో వణుకు మొదలైందని మహేశ్వరం నియోజకవర్గం బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ మేనిఫెస్టోను విడుదల చేసిన సందర్భంగా ఆర్‌కేపురం డివిజన్లో డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ నగర్ ప్రధాన రహదారిపై అరవింద శర్మతో కలిసి టపాసులు కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా అరవింద శర్మ మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలను దృష్టిలో ఉంచుకొని ప్రవేశపెట్టిన మేనిఫెస్టో తో ప్రజల్లో సంతోషాలు వెలివెత్తుతున్నాయని అన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

చంపాపేట: ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధతో ఎల్‌బీనగర్‌లో చేపట్టిన అభివృద్ధి పనులను చూడటం వల్లనే తాను బీఆర్‌ఎస్ పార్టీలో చేరానని చంపాపేట మారుతీనగర్‌కు చెందిన రాష్ట్ర టీఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు ముత్యాల సత్యనారాయణ స్పష్టం చేశారు. సోమవారం చంపాపేటలో జరిగిన ఓ కార్యక్రమంలో కర్మన్‌ఘాట్ శ్రీధ్యానాంజనేయ స్వామివారి ఆలయ చైర్మన్ నల్లా రఘుమారెడ్డి ఆధ్వర్యంలో ఆయన ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. బీఆర్‌ఎస్‌తోనే అన్నివర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు.

లెక్క చెప్పాల్సిందే

- నియోజకవర్గంలో పక్కాగా కోడ్ అమలు
- రెండు చెక్‌పోస్టుల వద్ద ముమ్మరంగా వాహనాల తనిఖీ
- రూ.50వేల నగదు దాటితే రశీదు, పత్రాలు అడుగుతున్న పోలీసులు

మహేశ్వరం: అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. డిసెంబర్ 5 వరకు ఈ కోడ్ అమలులో ఉంటుంది. ఎన్నికల్లో డబ్బు, మద్యం ప్రభావాన్ని నిలువరించేందుకు ఎన్నికల సంఘం కఠిన చర్యలు తీసుకుంటోంది. అధికార యంత్రాంగం అంతా ఎన్నికల సంఘానికి లోబడి పనిచేయాల్సి ఉంటుంది. సాధారణ వ్యక్తులు వ్యాపార నిమిత్తం, ఆస్పత్రి,వ్యవసాయ అవసరాలు, పెళ్లిళ్ల షాపింగ్, సరుకులు కొనుగోలుతో పాటు ఇతర ఖర్చులు రూ.50 వేలకు మించి డబ్బుతీసుకెళ్తుంటే ఆ డబ్బు ఎక్కడి నుంచి వచ్చిందో తెలిపే పత్రాలు, బిల్లులు తప్పనిసరి చూపాలి. డబ్బులు బ్యాంకు నుంచి విత్‌డ్రా చేసి తీసుకొస్తే దానికి సంబంధించిన రశీదు, ఏటీఎం నుంచి వచ్చిన రశీదు, ఇతరుల నుంచి అప్పుగా తీసుకుంటే అందుకు సంబంధించిన పత్రాన్ని అధికారులకు చూపాల్సి ఉంటుంది.

నిరంతరం నిఘా...

మహేశ్వరం నియోజకవర్గంలో 3 ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్స్‌తో పాటు ఎస్‌ఎస్‌టీ(స్టాటిక్ సర్వేలెన్స్ టీమ్స్)ను త్వరలో నియమించనున్నారు. నియోజకవర్గ సరిహద్దుల్లో రెండుచోట్ల బాలాపూర్–చంద్రాయణగుట్ట మధ్య, శ్రీశైలం జాతీయ రహదారి కందుకూరు మండలం నేదునూర్ గేటు అమూల్ దాబా వద్ద చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి పోలీసులు తనిఖీలు చేపడుతున్నారు. ఈ టీమ్స్ షిఫ్టుల వారీగా 24 గంటల పాటు విధులు నిర్వర్తిస్తున్నారు. వీరితో పాటు ఎంసీసీ (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్) అమలు రెవెన్యూ సహా వివిధ శాఖల అధికారులు ఆయా టీమ్‌లలో విధులు నిర్వర్తిస్తున్నారు. వీరితో పాటు పోలీస్ నిఘా కొనసాగుతుంది. చెక్‌పోస్టులు సహా ప్రధాన రహదారులు, చౌరస్తా, జనవాసాలు ఎక్కువగా ఉన్నచోట సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.



వాహనాల తనిఖీల్లో పట్టుబడిన నగదును చూపిస్తున్న పోలీసులు

రెండు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశాం



నియోజకవర్గంలో రెండుచోట్ల చెక్ పోస్టులు ఏర్పాటు చేసి 24 గంటల పాటు తనిఖీలను నిర్వహిస్తున్నాం. 3 ఫ్లయింగ్ స్క్వాడ్స్‌ను ఏర్పాటు చేశాం. సమస్యాత్మక ప్రాంతాల్లో నిఘా పెంచాం. చౌరస్తాలు, ప్రధాన రోడ్ల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేశాం. అనుమానం వచ్చిన ప్రతీ వాహనాన్ని, వ్యక్తులను తనిఖీ చేపట్టి విచారించి వివరాలు సేకరిస్తున్నాం. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో సీఐలు, ఎస్‌ఐల ఆధ్వర్యంలో తనిఖీలు, నిఘా ఏర్పాటు చేశాం. నిబంధనలు పాటించాలి.

– శ్రీనివాస్, ఏసీపీ, మహేశ్వరం

రూ.15.7 లక్షల నగదు సీజ్ చేశాం



ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు నియోజకవర్గంలో నిర్వహించిన వాహనాల తనిఖీల్లో రూ.15,76,200 పట్టుకొని సీజ్ చేశాం. ఎక్సైజ్, పోలీసు శాఖ వారు సంయుక్తంగా గ్రామాల్లో బెల్టు దుకాణాలపై దాడులు చేసి నిల్వఉంచిన మద్యాన్ని స్వాధీనం చేకున్నారు. ఒక వ్యక్తి రూ.50 వేల వరకు నగాదు వెంట తీసుకెళ్ల వచ్చు. కోడ్ ఉల్లంఘించినా, శాంతి భద్రతలకు విఘాతం కలిగించినా కఠిన చర్యలు తప్పవు.

– సూరజ్ కుమార్, మహేశ్వరం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి

సబితమ్మను గెలిపించుకుందాం



ఆకులమైలారంలో సమావేశమైన బీఆర్‌ఎస్ శ్రేణులు

మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి

కందుకూరు: బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశంలో మరెక్కడా అమలు కావడంలేదని మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ డి.చంద్రశేఖర్ కొనియాడారు. సోమవారం మండల పరిధిలోని ఆకులమైలారంలో బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు శంకర్ తిరుపతయ్య, స్థానిక సర్పంచ్ కలమ్మరాజు ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మహేశ్వరం నియోజకవర్గంలో మంత్రి సబితారెడ్డి ఎన్నో అభివృద్ధి పనులు చేశారన్నారు. ఆకులమైలారం మీదుగా డబుల్ రోడ్డు నిర్మాణం, మెడికల్ కళాశాల లాంటి ప్రతిష్టాత్మక సంస్థలు నియోజకవర్గంలో వచ్చాయని, మరెన్నో రానున్నాయన్నారు. మరోసారి సబితారెడ్డి గెలుపునకు అందరూ కలిసికట్టుగా పని చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ డి.నందీశ్వర్, ఉపసర్పంచ్ రాంరెడ్డి, రైతుబంధు అధ్యక్షుడు కృష్ణరాంభూపాల్‌రెడ్డి, దశరథ, బీఆర్‌ఎస్ మండల మాజీ అధ్యక్షుడు భిక్షపతి, ఎంపీటీసీ రాములు, డైరెక్టర్లు శేఖర్‌రెడ్డి, ఆనంద్, సీనియర్ నాయకులు మహేందర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, దర్శన్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, అంజయ్య, జంగయ్య, పాండు, సురేష్, మహేందర్, బీరప్ప, మల్లయ్య, అమరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

పెద్దమ్మతండాలో...

పెద్దమ్మతండాలో జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, నియోజకవర్గ ఎస్టీసెల్ అధ్యక్షుడు లచ్చానాయక్, పార్టీ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు లక్ష్మీనర్సింహా రెడ్డి, స్థానిక సర్పంచ్ సుమన్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. సబితమ్మను మరోసారి గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ రేక్యానాయక్, బీసీసెల్ అధ్యక్షుడు పాండుగౌడ్, రాంచందర్, కుమార్, బాల్‌రాజు, తేజనాయక్, విజయ్, శంకర్‌నాయక్, వస్యానాయక్, నారాయణ, వినోద్, సురేష్ పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజారోహణ



ధ్వజ స్తంభానికి పూజలు చేస్తున్న పండితులు



హోమం నిర్వహిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

పహాడీషరీఫ్: వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ మామిడిపల్లి బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ధ్వజారోహణ పూజా కార్యక్రమం కొనసాగింది. రెండో రోజు ఉదయం బాలభోగం, యాగశాల ప్రవేశం, అగ్ని ప్రతిష్ఠ, హవనం, నివేదన తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. హోమం కార్యక్రమాన్ని ఆలయ కమిటీ చైర్మన్ కోట్ల వెంకటేష్ వాల్మీకి, ప్రముఖ దాత దామోదర్ సచిన్ సోని సతీసమేతంగా జరిపించారు. సాయంత్రం శ్రీ విష్ణు సహస్రనామ పారాయణం, హవనం, శేష వాహన సేవ నిర్వహించారు. 11వ డివిజన్ కార్పొరేటర్ శివకుమార్, బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు నరేందర్‌గౌడ్, పాలకమండలి సభ్యులు పద్మ శంకర్‌గౌడ్, కృష్ణసాయి, సహదేవ్, అశోక్ తదితరులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. వాసుదేవారెడ్డి, రఘువీర్‌రెడ్డి, నందీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

మరోసారి ఆశీర్వదించండి

మంత్రి సబితారెడ్డి



హుడాకాంప్లెక్స్: సబితారెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన నాయకులు



తుక్కుగూడ: మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన నాయకులు

హుడాకాంప్లెక్స్: మహేశ్వరం నియోజకవర్గాన్ని పెద్దఎత్తున అభివృద్ధి చేశామని, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించామని మరోసారి బీఆర్‌ఎస్‌ను ఆశీర్వదించాలని మంత్రి సబితారెడ్డి విజ్ఞప్తి చేశారు. సరూర్‌నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ పారుపల్లి అనితా దయాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంత్రి సబితారెడ్డి సమక్షంలో పలువురు సోమవారం బీఆర్‌ఎస్ చేరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నియోజకవర్గ పరిధిలో అనేక ఐటీ కంపెనీలు ఏర్పాటు చేసి వేలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు కల్పించామన్నారు. అదేవిధంగా ట్రాఫిక్ సమస్యను అధిగమించడంలో భాగంగా స్కైవే, ఫ్లైఓవర్ల నిర్మాణాలు చేపట్టామని అన్నారు. నగరం నుంచి కందుకూరు వరకు మెట్రోరైల్ నిర్మాణానికి కూడా శ్రీకారం చుట్టామని తెలిపారు. ముఖ్యంగా ప్రజల ఆరోగ్య సంరక్షణను దృష్టిలో పెట్టుకుని రూ.1200 కోట్ల వ్యయంతో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. బీఆర్‌ఎస్ నాయకులు పారుపల్లి దయాకర్‌రెడ్డి, రిషీ, రాఘవేంద్రగుప్తా, రణధీర్‌రెడ్డి, అంకిరెడ్డి, ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

తుక్కుగూడ: ప్రజా సంక్షేమం కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం కృషి చేస్తోందని విద్యాశాఖ మంత్రి పి.సబితారెడ్డి పేర్కొన్నారు. మున్సిపల్ పరిధిలోని మంఖాల్, రావిర్యాల గ్రామాలకు చెందిన ఆయా పార్టీల నాయకులు సోమవారం ఆమె సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ప్రకటించిన మేనిఫె స్టో సామాన్యునికి లబ్ధి చేకూర్చేలా ఉందన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలో తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు అనంతరం పెద్ద ఎత్తున అభివృద్ధి జరిగిందన్నారు. నవంబర్ 30న జరిగే పోలింగ్‌లో అభివృద్ధి చేసిన పార్టీకి అండగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు జల్లాల లక్ష్మయ్య యాదవ్, కౌన్సిలర్లు రవి నాయక్, సుమన్, ఇతర నాయకులు పాల్గొన్నారు.